

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



ఆదివారం 04-10-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :108 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

'సత్యాగ్రహ'

డిజిటల్ వేదిక ప్రారంభం!



2 లో

'సత్యాగ్రహ' డిజిటల్ వేదికను ప్రారంభించిన రాహుల్

ప్రజా సమస్యలకు ఒకే వేదికగా సత్యాగ్రహ ప్లాట్‌ఫామ్

నిరసనలు, ఉద్యమాలను డిజిటల్ మ్యాప్‌లో నమోదు

భూమి, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి

దళితులు, గిరిజనులు, ఓబీసీల హక్కులకు ప్రాధాన్యం

విద్యార్థుల సమస్యలు, పేపర్ లీకేజీలపై ఫోకస్

నెక్ట్ టార్గెట్ సిద్దిపేట!

కేసీఆర్ ఇలాకాలో రేవంత్ సభలు

సిద్దిపేట సభపై కసరత్తు

అక్టోబర్ 7న సభకు యోచన

సిరిసిల్ల సభతో పెరిగిన జోష్

సీఎం ర్యాలీకి నేతల పట్టు

గ్రామస్థాయి కేడర్‌కు సన్నాహాలు

దసరా తర్వాత గజ్వేల్‌లో సభ



2 లో

న్యూస్ డెస్క్, 03 అక్టోబర్ (ఇది కద నిజం): కేసీఆర్ కుటుంబసభ్యుల నియోజకవర్గాలే లక్ష్యంగా సాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలు.. ఈ సారి సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. ఈ నెల 7వ తేదీ కల్లా బహిరంగ సభను నిర్వహించాలనే సమాలోచనలు చేస్తున్నారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా సిరిసిల్ల ఆ తరువాత సిద్దిపేట, ఆ తరువాత గజ్వేల్‌లో బహిరంగ సభలు అంటూ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే సిరిసిల్లలో సభను నిర్వహించారు. ఈ సభ విజయవంతం కావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు.

ఇదే ఊపు.. ఉత్సాహంతో సిద్దిపేటలోనూ సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈనెల 10వ తేదీ నుంచి బతుకమ్మ పండుగ ప్రారంభంకాబోతుంది. తెలంగాణలో అతి పెద్ద పండుగగా నిర్వహించే బతుకమ్మ పండుగ సమయంలో బహిరంగ సభ నిర్వహిస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉండటంతో ఈలోగానే బహిరంగ సభను సిద్దిపేటలో నిర్వహించాలని నిర్ణయించారు.

రాజ్యాంగం కోసం రోడ్డెక్కాలి

ప్రకాశ్ రాజ్!

రాజ్యాంగంపై ప్రకాశ్ రాజ్ ఫైర్

ప్రజాస్వామ్య రక్షణకు ఉద్యమం

ప్రజలు రోడ్డెక్కాలన్న పిలుపు

గాంధీ తరహా సత్యాగ్రహం అవసరం

హక్కుల పరిరక్షణే లక్ష్యమన్న ప్రకాశ్ రాజ్

రాజకీయ పార్టీలపై ఆధారపడొద్దని సూచన

జ్ఞానేశ్ కుమార్‌పై సంచలన వ్యాఖ్యలు

2 లో

22ఏ భూములకు భారీ ఊరట!

నాలా భూముల రిజిస్ట్రేషన్లకు గ్రీన్‌సిగ్నల్

నాలా రుసుముతో రిజిస్ట్రేషన్లు

ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం

22-ఏపై ఐదు కీలక ఉత్తర్వులు

కలెక్టర్లకు మంత్రి కీలక ఆదేశాలు

పెండింగ్ దరఖాస్తులకు వేగం

ప్రతిరోజూ సమస్యలపై మానిటరింగ్



2 లో

న్యూస్ డెస్క్, 03 అక్టోబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో ఏళ్ల తరబడిగా నలుగుతున్న 22-ఏ భూ సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నాలా అనుమతి లేకుండా నివాస వినియోగంలోకి వచ్చిన పట్టా భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన చిక్కుముడులను విప్పుతూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీపి కబురు అందించారు. తగిన నాలా రుసుము చెల్లించి, అర్హత ఉన్న భూములకు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు వీలుగా మార్గం సుగమం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అంశంపై రెవెన్యూ శాఖ ప్రత్యేకంగా మెమో నెం. 48062/ULC/A1/2026 ద్వారా అధికారిక ఉత్తర్వులు వెలువరించింది.

ఎన్నికలపై ఖర్గే సంచలన డిమాండ్!

లోక్‌సభ, అసెంబ్లీల రద్దుకు డిమాండ్

బ్యాలెట్ పేపర్లతో కొత్త ఎన్నికలకు పిలుపు

ప్రస్తుత ఎన్నికల విధానంపై కాంగ్రెస్ అభ్యంతరం

మోదీ, అమిత్ షాపై ఖర్గే ఆరోపణలు

2 లో

ఎన్నికల ప్రక్రియపై దేశవ్యాప్త చర్చకు పిలుపు

అక్టోబర్ 6న భారీ నిరసనకు కాంగ్రెస్ పిలుపు

రోడ్డుపై మందు.. ఎగబడిన జనం!

బిహార్‌లో రోడ్డుపైకి వచ్చిన మద్యం బాటిళ్లు

లారీ బోల్తాతో చెల్లాచెదురైన వందల సీసాలు

బాటిళ్ల కోసం ఎగబడిన వందలాది మంది జనం

ఒకరిపై మరొకరు ఎక్కి మద్యం కోసం పోటీ

ప్రమాదంలో గాయపడిన వారిని పట్టించుకోని జనం

ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు

2 లో

లూటీ చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

బీసీ కోటాపై ఏపీ సర్కార్ పిటిషన్!



2 లో

న్యూస్ డెస్క్, 03 అక్టోబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీవోలను ఏపీ హైకోర్టు ఇటీవల కొట్టివేసిన నేపథ్యంలో, ఆ తీర్పును సవాలు చేస్తూ ఏపీ ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

కోట్ల బిల్లుకు లెక్కేది?

- రిపేర్లకు ఇంత ఖర్చా?
- ఒక్క బిల్లుతో రూ.1,200 కోట్లు!
- అంచనాలు.. బిల్లులు.. తేడా ఏంటి?
- పంపుల రిపేర్లలో గోల్‌మాల్?
- అదే అధికారి ఎందుకు?
- బదిలీ ఎందుకు లేదు?
- విచారణ ఎందుకు లేదు?
- రూ.1,200 కోట్ల లెక్క ఏంటి?



న్యూస్ డెస్క్, 03 అక్టోబర్ (ఇది కద నిజం): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ (కన్నెపల్లి) పంప్‌హౌస్ మోటార్లు 2022 జూలైలో వచ్చిన గోదావరి వరదల కారణంగా నీట మునిగిన విషయం తెలిసిందే. వరదలతో పంప్‌హౌస్‌లు మునిగి భారీగా నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో చేపట్టిన మరమ్మతుల ఖర్చులపై ఇప్పుడు అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొదట రూ.25 కోట్ల మేర ఖర్చవుతుందని గతంలో తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రజత్ కుమార్ ఆ సమయంలో చెప్పారు. కానీ.. ఆ పంపులు రిపేరు, రీప్లేస్ చేయించడానికి వ్యయం చివరకు రూ.1,200 కోట్లకు ఎలా చేరిందనేది అనుమానాలకు తావిస్తున్నది. అంచనాలకు, తుది బిల్లులకు మధ్య ఇంత భారీ వ్యత్యాసానికి కారణమేంటి? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దీనిపై అప్పటి ప్రభుత్వం కానీ.. ఇప్పుడున్న ప్రభుత్వం కానీ దృష్టి సారించడం లేదు. అంతేకాకుండా.. ఆ బిల్లు మొత్తాన్ని కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో క్వాలిటీ కంట్రోల్‌లో పనిచేస్తున్న ఓ డిప్యూటీ ఈఈ ద్వారానే అంత పెద్ద మొత్తం బిల్లులు విడుదల చేసినట్టు తెలిసింది.

మిగతాది 2 లో..

పిల్లలకు సైబర్ ముప్పు!

పిల్లల సైబర్ భద్రతపై సీఎం ఫోకస్

చైల్డ్ ఆన్‌లైన్ సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్

ఆన్‌లైన్ ప్రమాదాలపై పిల్లలకు అవగాహన

మహిళలు, పిల్లల రక్షణే ప్రాధాన్యం

భరోసా కేంద్రాలతో సేవలు

దేశంలో తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు

విద్యార్థులే సైబర్ అంబాసిడర్లు

1930, 1098 నంబర్లు గుర్తుంచుకోండి



న్యూస్ డెస్క్, 03 అక్టోబర్ (ఇది కద నిజం): హైదరాబాద్ వేదికగా నిర్వహించిన 'నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (NALSA) దక్షిణ మండల ప్రాంతీయ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో పిల్లల సైబర్ భద్రత అత్యంత కీలకమైన అంశమని, తెలంగాణలో వారి రక్షణ కోసం త్వరలోనే ఒక సమగ్ర 'చైల్డ్ ఆన్లైన్ సేఫ్టీ ఫ్రేమ్ వర్క్' ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గాంధీజీ న్యాయాన్ని కేవలం వృత్తిగానే కాకుండా పేదలు, బలహీనుల కోసం ఒక ఆయుధంగా ఉపయోగించారని,

2 లో

18న ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ!



2 లో

అక్టోబర్ 18న ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ

వేలాది మంది మహిళలతో భారీ బతుకమ్మ వేడుకలు

అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్‌బండ్ వరకు ర్యాలీ

అక్టోబర్ 10 నుంచి 18 వరకు బతుకమ్మ ఉత్సవాలు

రవీంద్రభారతిలో 10 రోజుల పాటు ప్రత్యేక వేడుకలు

బతుకమ్మ నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు

బతుకమ్మ లోగోలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ అంశం

మాట నిలబెట్టుకున్న రేవంత్

కరెంట్ కోతలపై హరీశ్‌రావు ఫైర్

రేవంత్ మాట నిలబెట్టుకున్నారంటూ ఎద్దేవా

ఆరు గంటల కరెంట్ కూడా కష్టమే

ఎల్‌నినో సాకులు చెప్పొద్దంటూ ఆగ్రహం

నీళ్లు, కరెంట్ లేక ఎండుతున్న పంటలు

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా

సంక్షోభంలో రైతులకు అండగా నిలవాలి

నిరంతర విద్యుత్ ఇవ్వాలని డిమాండ్



న్యూస్ డెస్క్, 03 అక్టోబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ అభద్రత, సాగునీటి ఎద్దడిపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాత రోజులు తెస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి, నిజంగానే ఆనాటి అంధకారపు కరెంట్ కోతల రోజులను తిరిగితీసుకొచ్చారని ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఎద్దేవా చేశారు. 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వడం దేవుడెరుగు, కనీసం 6 గంటలు కూడా సరఫరా చేయలేక ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని విమర్శించారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 04-10-2026

రాజ్యాంగం కోసం రోడ్డెక్కాలి: ప్రకాశ్ రాజ్!



న్యూస్ డెస్క్, 03 అక్టోబర్ (ఇది కద నిజం): ప్రస్తుత పాలకుల వైఖరిపై ప్రముఖ నటుడు, సామాజిక విశ్లేషకుడు ప్రకాష్ రాజ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేటి పాలకులు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని చంపేసేందుకు ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. దేశంలో స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలంటే ప్రజలంతా రోడ్డెక్కక తప్పదని పిలుపునిచ్చారు. గాంధీజీ చేపట్టిన సత్యాగ్రహం తరహాలోనే మళ్లీ ఓ పెద్ద ఉద్యమం జరగాల్సిన అవసరం ఉందన్నారు.

హక్కుల పరిరక్షణే ధ్యేయం..

ఈ పోరాటం కేవలం ఓట్లను కాపాడుకోవడానికి మాత్రమే పరిమితం కాదని, ఓటు హక్కుతో పాటు భారత రాజ్యాంగం పౌరులందరికీ కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం వంటి ప్రాథమిక హక్కులను పరిరక్షించుకోవడమే అసలైన ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ పోరాటం కోసం ఎవరినీ నమ్ముకోవాల్సిన పనిలేదని, ఏ రాజకీయ పార్టీపైనా ఆధారపడాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. పౌరులుగా ప్రజలే స్వతహాగా స్పందించి రోడ్డెక్కి తమ నిరసనను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కు సవరణ/పరిశీలన ప్రక్రియతో పాటు దేశంలో జరుగుతున్న పరిణామాలపై స్పందిస్తూ.. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ గళం విప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మొన్నటి వరకు గణేష్ నిమజ్జనం అయ్యింది.. ఇప్పుడు జ్ఞానేశ్ కుమార్ నిమజ్జనం కావాలని ప్రకాశ్ రాజ్ డిమాండ్ చేశారు.

పిల్లలకు సైబర్ ముప్పు!

మొదటి పేజీ తరువాయి

అదే స్ఫూర్తితో న్యాయ సేవా సంస్థలు పనిచేస్తూ రూపాయి లేని పేదవాడికి కూడా ఉచితంగా న్యాయం అందించాలని ఆకాంక్షించారు. పిల్లలు ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం గడుపుతున్నప్పటికీ, అక్కడ పొంచి ఉన్న ప్రమాదాలను గుర్తించేంత అవగాహన వారికి ఉండదని పేర్కొన్నారు. డిజిటల్ నేరాలు పెరిగిన నేపథ్యంలో పిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లల రక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బాధితులకు ఒకే చోట అన్ని సేవలు అందించేలా భరోసా కేంద్రాలు, దేశంలోనే తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టును హైదరాబాద్లో అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.

అవగాహన కార్యక్రమాలు..

విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో SHE-భరోసా సైబర్ ల్యాబ్‌లు, CybHER యాప్ ద్వారా విద్యార్థులను 'సైబర్ అంబాసిడర్లు'గా' తీర్చిదిద్దుతున్నామని వివరించారు. TGS-LSA ద్వారా ఉపాధ్యాయుల సాయంతో చట్టపరమైన హక్కులపై పిల్లలకు శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. పిల్లలతో ప్రతిరోజూ స్నేహపూర్వకంగా, ఆసక్తిగా మాట్లాడాలని, వారు ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారో గమనిస్తూ సరైన మార్గదర్శకత్వం, ప్రేమ అందించాలని కోరారు. సైబర్ నేరాల బాధితుల కోసం 1930, చైల్డ్ హెల్ప్ లైన్ కోసం 1098 నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. న్యాయం అంటే నేరస్థులకు శిక్ష పడటమే కాదు, బాధితుడి గౌరవాన్ని, చిన్నారి కోల్పోయిన బాల్యాన్ని తిరిగి ఇవ్వడమేనని ఈ సందర్భంగా సీఎం అభిప్రాయపడ్డారు. తెలంగాణ హైకోర్టు, టీజీఎస్-ఎల్ఎస్ఏ భాగస్వామ్యంతో ఈ ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించి, రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని గ్రామ స్థాయి వరకు న్యాయ సేవలను విస్తరిస్తామని పునరుద్ఘాటించారు.

మాట నిలబెట్టుకున్న రేవంత్

మొదటి పేజీ తరువాయి

సాకులు చెప్పొద్దు..

కరెంట్ కోతలకు 'ఎల్ నినో' ప్రభావమే కారణమని నెపం నెట్టి ప్రభుత్వం బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూస్తోందని, కానీ నీళ్లు, కరెంట్ లేక పంటలు ఎండిపోతుంటే రైతన్నల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పంట పొలాలు ఎండిపోవడంతో కడుపు మండిన మెదక్ జిల్లా రామాయంపేట రైతులు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. "పరిపాలన అంటే మైకుల ముందు నిలబడి ఉపన్యాసాలు దంచడం కాదు.. సంక్షోభంలో ఉన్న అన్నదాతకు అండగా నిలవడం" అని సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు సూచించారు. సకాలంలో సాగునీరు, నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించి రైతుల బతుకులను నిలబెట్టడమే ప్రభుత్వ ప్రాథమిక కర్తవ్యమని, ఇప్పటికైనా మాటలు కట్టిపెట్టి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

22ఏ భూములకు భారీ ఊరట!

మొదటి పేజీ తరువాయి

అర్హత ఉన్న దరఖాస్తులను నిర్దిష్ట కాలపరిమితిలోగా వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లకు మంత్రి పొంగులేటి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

హామీల అమలులో వేగం..

22-ఏ భూ సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలును ప్రభుత్వం శరవేగంగా ముందుకు తీసుకెళ్తుంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఐదు కీలక ఉత్తర్వులను జారీ చేసింది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు ఉండి 22-ఏ జాబితాలో చిక్కుకున్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి లభించింది. జీవో 118, జీవో 76లకు అనుగుణంగా మార్గదర్శకాలను రూపొందించి, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి మార్గం సుగమం చేశారు.

నాలా భూములకు ఊరట..

గతంలో నాలా ప్రక్రియ పూర్తికాకపోవడం వల్ల ఆగిపోయిన నివాస పట్టా భూముల సమస్యకు కూడా తాజా నిర్ణయంతో శాశ్వత పరిష్కారం లభించింది. ప్రభుత్వం ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా తీసుకున్న ఈ ప్రజానుకూల నిర్ణయాలను క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో అమలు చేయడం అధికారుల కనీస బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. 22-ఏ సమస్యల పరిష్కార ప్రక్రియపై ప్రతిరోజూ నిరంతర మానిటరింగ్ (సమీక్ష) నిర్వహించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా సేవలు అందించాలని మంత్రి హెచ్చరించారు.

బీసీ కోటాపై ఏపీ సర్కార్ పిటిషన్!

మొదటి పేజీ తరువాయి

ఈ కేసుకు సంబంధించి గతంలో విచారణ జరిపిన హైకోర్టు, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం వల్ల మొత్తం రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికి మించిపోతుందని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులు, మార్గదర్శకాలకు విరుద్ధంగా ఈ జీవోలు ఉన్నాయని పేర్కొంటూ, 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీవోలను హైకోర్టు రద్దు చేసింది. అదే సమయంలో, రిజర్వేషన్ల అంశంపై తుది నిర్ణయం తేలే వరకు ఎన్నికలు ఆపాల్సిన అవసరం లేదని ధర్మాసనం అభిప్రాయపడింది.

ఓటర్ల జాబితా నమోదు (సర్ ప్రక్రియ)తో సంబంధం లేకుండా, నిర్దేశిత గడువులోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేస్తూ ఎన్నికల నిర్వహణకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. అయితే, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న తమ నిర్ణయానికి కట్టుబడి ఉన్న ఏపీ ప్రభుత్వం, హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. బీసీల సామాజిక, రాజకీయ ప్రాతినిధ్యం దృష్ట్యా ఈ రిజర్వేషన్లు అవసరమని పేర్కొంటూ, హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించాలని, బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిపేలా ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వం తన పిటిషన్‌లో కోరింది. దీనిపై సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టాల్సి ఉంది.

నెక్ట్స్ టార్గెట్ సిద్దిపేట!

మొదటి పేజీ తరువాయి

పార్టీ ముఖ్య నాయకులు శుక్రవారం సభ నిర్వహణ తేదీలపై చర్చించినట్టుగా తెలిసింది. ఈ నెల 5, 6, 7 తేదీల్లో సభను నిర్వహించాలని సమాలోచనలు జరిపారు. 5వ తేదీ అయితే తక్కువ సమయం ఉన్నందున 7వ తేదీ అయితే నాయకులకు సభ ఏర్పాట్లకు కొంత సమయం ఇచ్చినట్టుగా అవుతుందని, ఆలోచన చేసినట్టుగా సమాచారం. సభ తేదీపై శనివారం స్పష్టత వచ్చే అవకాశం ఉందని సమాచారం.

సీఎం ర్యాలీకి పట్టు

సిద్దిపేటలో కూడా సిరిసిల్ల తరహాలో ర్యాలీకి అవకాశం ఇవ్వాలని సిద్దిపేట నాయకులు బలంగా కోరుతున్నారు. తమ బలాన్ని చూపించుకోవడానికి, సత్తాను చాటడానికి ఇదే సరియైన వేదికనే ఉద్దేశంతో నాయకులు ర్యాలీకి పట్టుపడుతున్నారని తెలిసింది. జిల్లా నాయకులు బహిరంగ సభకు అవసరమైన ఏర్పాట్లలో మునిగారు. గ్రామ స్థాయి నాయకులను సన్నద్ధం చేస్తున్నారు.

పండుగ తరువాత..

దసరా తరువాత గజ్వేల్‌లో సభను ఏర్పాటు చేయనున్నారు. బీఆర్ఎస్ పార్టీ కీలక నాయకులుగా ఉన్న కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో వారినే ఇరకాటం పెట్టే విధంగా, ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కేడర్‌ను, కార్యకర్తలను ఉత్సాహ పరిచే విధంగా, ప్రజలు ఈ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే ఏం చేయబోతామో చెప్పే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రణాళికలు, ఆలోచనలను ప్రజలకు వివరించాలని నిర్ణయించారు. అదే సమయంలో ఈ నియోజకవర్గాల్లో కొన్నేండ్లుగా అక్కడ గెలుస్తూ బయట చేస్తున్న అక్రమాలు, ఆస్తులు తదితర వాటిని ప్రజలకు వివరించడం లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలు సాగుతున్నాయి. ఏ నియోజకవర్గం పోతే అక్కడి నాయకుల అక్రమాలు, భూములు, ఆస్తుల చిట్టాను విప్పడానికి అవసరమైన ఆధారాలన్నింటినీ సేకరించారు. దీంతో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు వారి నియోజకవర్గానికే పరిమితమయ్యేలా చేయాలని, రాష్ట్రమంతా పర్యటించకుండా అక్కడే వారిని కట్టడి చేయాలని రాజకీయ వ్యూహంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్టుగా సమాచారం. వారు రాష్ట్రమంతా పర్యటించి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డి అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో భారీ సభలు పెడుతున్నారు.

రోడ్డుపై మందు.. ఎగబడిన జనం!



న్యూస్ డెస్క్, 03 అక్టోబర్ (ఇది కద నిజం): క్రైంకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచి బిహార్ సంపూర్ణ మద్యపాన నిషేధం అమల్లో ఉంది. 2016 ఏప్రిల్ 5 నుండి బిహార్‌లో అన్ని రకాల మద్యం తయారీ, విక్రయాలను, మద్యం సేవించడాన్ని అక్కడి ప్రభుత్వం పూర్తిగా నిషేధించారు. నాటి నుంచి నేటి వరకు అక్కడ 'బిహార్ మద్యపాన నిషేధం మరియు ఎక్సైజ్ చట్టం 2016' కఠినంగా అమలవుతోంది. అయితే గాంధీ జయంతి రోజే దొంగచాటుగా మద్యం అక్రమ రవాణా చేస్తున్న ఓ లారీ బోల్తా పడింది. దీంతో అందులోని బాటిళ్లు రోడ్డుపైకి చెల్లాచెదురుగా పడ్డాయి. ఇంకేముంది.. నిషేధం ఉన్న సంగతే మరిచిపోయిన ప్రజలు, బాటిళ్లను ఎత్తుకెళ్లేందుకు ఎగబడ్డారు. ఒకరిపై మరొకరు ఎక్కి.. లారీలోని మద్యం బాటిళ్లను అందినకాడికి ఎత్తుకెళ్లారు.

అరారియాలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను స్థానిక పోలీసులు వెల్లడించారు. నిషిద్ధ ప్రాంతంలో మద్యం తరలిస్తున్న ఓ లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. తీవ్ర శబ్దంతో లారీ పల్టీ కొట్టడంతో లోపల ఉన్న వందలాది మద్యం సీసాలు రోడ్డుపై పడ్డాయి. రోడ్డుపై మద్యం బాటిళ్లు పడి ఉన్న దృశ్యాన్ని చూసిన స్థానికులు ఒక్కసారిగా అక్కడికి పరుగులు తీశారు. లారీలో ఉన్న వ్యక్తులు గాయపడి ఉన్నా.. వారిని రక్షించకుండా చేతికి దొరికినన్ని బాటిళ్లను పట్టుకుని పరారయ్యేందుకు జనం పోటీ పడ్డారు. రోడ్డుపైనే మందు బాటిళ్ల కోసం ఎగబడిన ఈ తతంగాన్ని చూసి ప్రయాణికులు విస్మయానికి గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి మద్యం లూటీ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

'సత్యాగ్రహ' డిజిటల్ వేదిక ప్రారంభం!



న్యూస్ డెస్క్, 03 అక్టోబర్ (ఇది కద నిజం): దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజల గొంతుకలను ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సత్యాగ్రహ పేరుతో ఒక డిజిటల్ వేదికను న్యూఢిల్లీలో అధికారికంగా ప్రారంభించారు. శాంతియుత ప్రతిఘటన, అధికారాన్ని ప్రశ్నించడం, ప్రజా సమస్యలను బలంగా వినిపించడమే ఈ ప్లాట్‌ఫామ్ ప్రధాన లక్ష్యమని ఆయన వెల్లడించారు. ఈ వేదిక ద్వారా దేశంలోని ఏ మూలనైనా జరుగుతున్న నిరసనలు, ప్రజా ఉద్యమాల సమాచారాన్ని ఒకే డిజిటల్ మ్యాప్‌పైకి తీసుకురానున్నారు. ముఖ్యంగా భూమి హక్కులు, మహిళల భద్రత, దళితులు, గిరిజనులు, ఓబీసీల హక్కుల సమస్యలపై ఈ వేదిక ప్రత్యేక దృష్టి సారిస్తుంది. అంతేకాకుండా యువత, విద్యార్థులను వేధిస్తున్న విద్య, పరీక్షల నిర్వహణ, క్వశ్చన్ పేపర్ లీకేజీల వంటి కీలక సమస్యలకు కూడా ఈ ప్లాట్‌ఫామ్‌లో ప్రాధాన్యత కల్పించనున్నారు.

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "దేశవ్యాప్తంగా ఎంతోమంది తమ హక్కుల కోసం ఒంటరిగా పోరాడుతున్నారు. ఒంటరిగా లేచే గొంతుకను అణచివేయడం సులభం, అందుకే వారందరినీ ఒకే వేదికపైకి తెచ్చి సంఘటితం చేయడానికే ఈ సత్యాగ్రహ వేదికను ప్రారంభించాం. ప్రజలు తమ సమస్యల తీవ్రత, ప్రాధాన్యత ఆధారంగా ఈ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే, లోక్‌సభ ప్రతిపక్ష నేతగా పార్లమెంట్‌లోనూ, వీధుల్లోనూ వారి తరఫున పోరాడి న్యాయం జరిగేలా చూస్తాం" అని స్పష్టం చేశారు.

ఎన్నికలపై ఖర్గే సంచలన డిమాండ్!



న్యూస్ డెస్క్, 03 అక్టోబర్ (ఇది కద నిజం): దేశంలో జరిగిన అన్ని ఎన్నికలు బూటకమని, ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాతో పాటు రాష్ట్రాల ముఖ్యమంత్రులంతా అక్రమమేనంటూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలోని కలబురగిలో జాతీయ మీడియాతో ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభతో పాటు వివిధ రాష్ట్రాల శాసనసభలను రద్దు చేసి, బ్యాలెట్ పేపర్ల ద్వారా కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

అన్ని ఎన్నికలు అక్రమమే.. దేశంలో ప్రస్తుతం జరుగుతున్న పాలన అంతా అక్రమ ఎన్నికల మీదే ఆధారపడి ఉందని మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. మోదీ అక్రమ ప్రధాని అని, అమిత్ షా అక్రమ మంత్రి అని, అలాగే దేశవ్యాప్తంగా ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగానే ఆ పదవుల్లో ఉన్నారని ఆరోపించారు. ప్రస్తుత ఎన్నికల ప్రక్రియలో వ్యక్తమవుతున్న ఆందోళనల నేపథ్యంలో.. ఉన్న ప్రభుత్వాలను, అసెంబ్లీలను రద్దు చేసి, పూర్తిగా బ్యాలెట్ పేపర్ల విధానంలోనే తాజా ఎన్నికలు జరపాలని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై ఇటీవలే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించామని తెలిపారు. ఓటింగ్ హక్కులపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన కల్పిస్తామని, అక్టోబర్ 6న దేశ రాజధానిలో భారీ నిరసన కార్యక్రమం చేపడతామని మల్లికార్జున ఖర్గే వెల్లడించారు.

18న ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ!



న్యూస్ డెస్క్, 03 అక్టోబర్ (ఇది కద నిజం): తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను ఈ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. అక్టోబర్ 10 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఈ వేడుకల ఏర్పాట్లపై సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ..

ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన 'సద్దుల బతుకమ్మ'ను ఈనెల 18వ తేదీన హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పై వేలాది మంది మహిళలతో కలిసి అట్టహాసంగా నిర్వహించనున్నారు. అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్‌బండ్ వరకు భారీ బతుకమ్మ ర్యాలీ నిర్వహించనున్నారు. అదేవిధంగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి లో 10 రోజుల పాటు ప్రత్యేక బతుకమ్మ ఉత్సవాలు జరగనున్నాయి. అలాగే తెలంగాణలోని అన్ని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లోనూ ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నిమజ్జన ఏర్పాట్లు.. స్పెషల్ లోగో

ట్యాంక్‌బండ్‌పై జరిగే వేడుకల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బతుకమ్మ ఘాట్, నెక్లెస్ రోడ్‌లో పూల నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఈసారి బతుకమ్మ వేడుకల కోసం ప్రభుత్వం ఓ స్పెషల్ లోగో ను రూపొందిస్తుండగా.. ఆ లోగోలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ అంశాన్ని కూడా జోడించడం ప్రాధాన్యతను సంతరించుకున్నది.

కోట్ల బిల్లుకు లెక్కేదీ?

మొదటి పేజీ తరువాయి

ఆయనే.. సింగిల్ బిల్లు రూపంలో ఆ బిల్లును రాయడం గమనార్హం. అయితే.. ఈ విషయాన్ని శాఖాపరంగా ఇంతవరకూ బయటపెట్టకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసే అంశం. ఈ ప్రభుత్వం సైతం చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలకు తావిస్తున్నది. ఈ బిల్లుల వెనుక చాలా మంది పెద్దలు ఉన్నట్టు తెలుస్తున్నది.

అంచనా నుంచి రూ.1,200 కోట్లకు ఎలా?

కన్నెపల్లి (లక్ష్మి) పంప్‌హౌస్ నీట మునిగిన సమయంలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న రజత్‌కుమార్ పంప్‌హౌస్ మరమ్మతులకు రూ.25 కోట్లు ఖర్చవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. కానీ.. ఆ బడ్జెట్ ఊహించని స్థాయికి దాటిపోవడం గమనార్హం. పంప్‌ల మరమ్మతులకు తొలుత తక్కువ మొత్తంలో అంచనా వేసి.. ఆ తర్వాత పనుల పరిధి, ఖర్చులు పెరిగినట్టు చూపిస్తూ భారీగా బిల్లులు రూపొందించారా? లేక నిజంగానే అదనపు పనులు అవసరమయ్యాయా? అన్నది తెలియకుండా ఉంది. ఒక్కో పనికి ఎంత అంచనా వేశారు..? ఎంత ఖర్చు చేశారు..? ఏ పనులకు ఎంత చెల్లించారు..? అనే వివరాలు బయటకు వస్తేనే అసలు లెక్క తేలనుంది. మరమ్మతుల పనులకు సంబంధించిన అంచనాలు ఎవరు రూపొందించారు? వాటిని ఎవరు ఆమోదించారు? పనులు పూర్తయినట్టు ధ్రువీకరించింది ఎవరు? బిల్లులు రూపొందించి చెల్లింపులకు మార్గం సుగమం చేసింది ఎవరు? అన్న అంశాలు ఇప్పుడు కీలకంగా మారాయి. ముఖ్యంగా బిల్లుల తయారీలో కీలకంగా వ్యవహరించిన రామగుండం సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న సదరు డిప్యూటీ ఈఈ పాత్రపైనా విచారణ జరగాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

అదే అధికారి ఎందుకు?

పంప్‌హౌస్ మరమ్మతుల బిల్లుల వ్యవహారంలో కీలకంగా ఉన్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న రామగుండం సర్కిల్ డిప్యూటీ ఈఈకే బాధ్యతలు ఎందుకు అప్పగించారన్న ప్రశ్న కూడా తెరపైకి వస్తున్నది. ఇంత భారీ మొత్తంతో ముడిపడిన పనుల పర్యవేక్షణ, బిల్లుల ప్రక్రియలో అదే అధికారికి వరుసగా బాధ్యతలు అప్పగించడానికి కారణమేంటి? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రూ.25 కోట్ల అంచనా నుంచి రూ.1,200 కోట్లకుపైగా ఖర్చు చేరితే.. మధ్యలో జరిగిన ప్రతి పనికి లెక్క చెప్పకుండా ఎందుకు దాచాల్సి వచ్చిందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఏ పంప్‌కు ఎంత ఖర్చు? ఏ పరికరానికి ఎంత? మరమ్మతుల పేరుతో కొత్తగా ఏం కొనుగోలు చేశారు? టెండర్లు జరిగాయా? కొత్త పంపులను ఏర్పాటు చేశారా..? నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగించారా? చెల్లింపులు ఎవరి ఆమోదంతో జరిగాయి? ఇవన్నీ వెలుగులోకి రావాల్సి ఉన్నదని శాఖలో చర్చ నడుస్తున్నది.

బదిలీ ఎందుకు లేదు?

ఇంతటి భారీ వ్యయంతో సంబంధం ఉన్న పనులపై ఆరోపణలు వస్తున్నప్పటికీ సంబంధిత డిప్యూటీ ఈఈని రామగుండం సర్కిల్ నుంచి ఎందుకు బదిలీ చేయలేదన్నది మరో ప్రశ్న. అసలు ఆయన మీద విచారణ సైతం ఎందుకు చేయలేదన్న ప్రశ్నలూ వినిపిస్తున్నాయి. రూ.1,200 కోట్లకు పైగా బిల్లును స్వయంగా రాసి.. డ్రా చేయించిన అంశంపై ఇప్పుడున్న ప్రభుత్వం కూడా ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదన్న చర్చ నడుస్తున్నది. అంతేకాకుండా.. ఆ డిప్యూటీ ఈఈ అదే సర్కిల్‌లో ఎనిమిదేండ్లుగా పనిచేస్తున్నా బదిలీ చేసే వారు సైతం లేకుండాపోయారు. అంత పెద్ద మొత్తం బిల్లులో ఈ డిప్యూటీ ఈఈ చేతివాటం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఉన్నతాధికారుల ప్రోత్సాహంతోనే ఇదంతా చేశారా అన్న అనుమానాలూ కలుగుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణలో ప్రతి రూపాయికి లెక్క ఉండాలని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో.. మేడిగడ్డ కన్నెపల్లి పంప్‌హౌస్ మరమ్మతుల ఖర్చులపై సమగ్ర ఆడిట్ నిర్వహిస్తే అసలు లెక్కలు బయటపడే అవకాశం ఉన్నది. పంప్‌హౌస్‌లలో పంప్‌ల మరమ్మతుకు అంచనా నుంచి తుది బిల్లు వరకు పూర్తి వివరాలను బహిర్గతం చేయడంతోపాటు బాధ్యులెవరైనా ఉంటే చర్యలు తీసుకోవాలనే డిమాండ్ శాఖలో వినిపిస్తోంది.

మావోయిస్టు రహిత రాష్ట్రంగా మహారాష్ట్ర..

న్యూస్ డెస్క్, 03 అక్టోబర్ (ఇది కద నిజం): మహారాష్ట్ర స్టేట్ నుంచి సాయుధ మావోయిస్టుల ఉనికి పూర్తిగా కనుమరుగైంది. పోలీసు రికార్డుల ప్రకారం రాష్ట్రంలో ఇకపై ఎలాంటి సక్రియ సాయుధ మావోయిస్టులు లేరని మహారాష్ట్ర పోలీసులు అధికారికంగా ప్రకటించారు. గడ్చిరోలి జిల్లాలో మే 2026 నాటికి మావోయిస్టుల ప్రాబల్యం పూర్తిగా అంతం కావడంతో ఈ చారిత్రాత్మక మైలురాయి సాధ్యమైంది.

కేపీ రఘువంశీకి ఘన సత్కారం..

ఈ సందర్భంగా ముంబై లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మావోయిస్టులపై పోరులో కీలకపాత్ర పోషించిన ఎలైట్ యాంటీ-మావోయిస్ట్ కమాండో ఫోర్స్ సి-60 వ్యవస్థాపకుడు, మాజీ ఐపీఎస్ అధికారి కేపీ రఘువంశీ ని రాష్ట్ర పోలీసులు ఘనంగా సత్కరించారు. గడ్చిరోలి ఎస్పీగా పనిచేసిన కాలంలో 1990 డిసెంబర్ 1న కేపీ రఘువంశీ స్థానిక గిరిజన యువకులతో కేవలం 60 మందితో ఈ 'సి-60' అనే కమాండో దళాన్ని ఏర్పాటు చేశారు. కఠినమైన అటవీ ప్రాంతాలు, స్థానిక భాషలైన గోండి, మడియాపై పట్టున్న ఈ బలగాలు మావోయిస్టుల ఏరివేతలో అద్భుతమైన ఫలితాలు సాధించాయి. ప్రస్తుతం ఈ విభాగం గడ్చిరోలి, గోండియా ప్రాంతాల్లో బలమైన బృందాలుగా విస్తరించాయి.

మావోయిస్టుల ఏరివేత ఇలా..

దశాబ్దాల పాటు సాగిన ఈ సుదీర్ఘ యాంటీ-మావోయిస్ట్ ఆపరేషన్ల లో మొత్తం 363 మంది మావోయిస్టులు హతమవ్వగా, ఏకంగా 558 మందిని అరెస్టు చేశారు. అలాగే 861 మంది మావోయిస్టులు సరెండ్ అయి జనజీవన స్రవంతిలో కలిసిపోయి ఆనందంగా జీవనాన్ని కొనసాగిస్తున్నారు. అయితే, మావోయిస్టులతో భీకర పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన 244 మంది పోలీసులు, భద్రతా సిబ్బంది, 609 మంది పౌరుల త్యాగాలను ఈ కార్యక్రమంలో స్మరించుకున్నారు. సీఆర్పీఎఫ్, ఎస్సార్పీఎఫ్ సిబ్బంది సేవలను పోలీసు ఉన్నతాధికారులు కొనియ

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 04-10-2026

పిట్లం తహసిల్దార్ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డులు అందుబాటులో



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: పిట్లం తహసీల్దార్ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డులు అందుబాటులో ఉన్నాయని తహసీల్దార్ మహేందర్ తెలిపారు. మండల పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరైన లబ్ధిదారులు తమకు సంబంధించిన కార్డులను తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. లబ్ధిదారులు ఎలాంటి ఆలస్యం చేయకుండా కార్యాలయానికి చేరుకుని తమ స్మార్ట్ రేషన్ కార్డులను స్వీకరించుకోవాలని తహసీల్దార్ మహేందర్ కోరారు. సంబంధిత లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి, కార్డుల కోసం కార్యాలయానికి రావాలని తెలిపారు.

రైల్వే ప్రయాణికులకు పోలీసుల అవగాహన





ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కామారెడ్డి: జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు కామారెడ్డి రైల్వేస్టేషన్ ఆవరణలో శనివారం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణ సమయంలో దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రైలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని అవగాహన కల్పించారు. సైబర్ నేరాల కోసం 1930, మాదక ద్రవ్యాల సమాచారానికి 1908, అత్యవసర సమయంలో 112కు, మహిళల రక్షణ కోసం షీ టీమ్ నంబర్ 8712686094ను సంప్రదించాలని సూచించారు. పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, శేషరావు, కానిస్టేబుల్స్ ప్రభాకర్, సాయిలు మాటలు, పాటల ద్వారా అవగాహన కల్పించారు. రైల్వే సిబ్బంది సంతోష్ కుమార్, కాసనతో పాటు పలువురు ప్రయాణికులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ఎన్నికలు..

15 ఈసి సభ్యులకోసం 33 నామినేషన్ లు దాఖలు



నల్లగొండ (ఇది కద నిజం): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ఎన్నికల కోలాహలం నెలకొంది.. సొసైటీ ప్రస్తుత కార్యవర్గ పదవీ కాలం మిగియడంతో నూతన కార్యవర్గం ఎన్నుకునేందుకు అధికారులు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.. ఇందులో భాగంగా సెప్టెంబర్ చివరి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి ఓటరు జాబితా అభ్యంతరాలు స్వీకరించి ఈనెల వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటించారు.. ఆమేరకు ఈరోజు నామినేషన్లు స్వీకరించారు.. జిల్లా వ్యాప్తంగా 1385 మంది సభ్యులున్న నల్లగొండ ఈ సొసైటీలో 15మంది ఈసీ మెంబర్లకు గాను 33 నామినేషన్లు దాఖలయ్యాయి.. దాదాపు 2పానెళ్లుగా అభ్యర్థులు నామినేషన్ లు తమ నామినేషన్ లు దాఖలు చేశారు.. నామినేషన్ల అనంతరం సొసైటీ ఎన్నికల అధికారి మమత మీడియాతో మాట్లాడుతూ..ఈ ఎన్నిక కు సంబంధించి ఈనెల 5వ తేదీన నామినేషన్ల పరిశీలన జరిపి ఆరో తేదీన నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇస్తామని అన్నారు. నామినేషన్ ల ఉపసంహరణ అనంతరం 15మంది కన్నా ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే 11వ తేదీన ఎన్నికలు నిర్వహించి అదేరోజు ఓట్ల లెక్కింపు జరిపి అభ్యర్థులను ప్రకటిస్తామని అన్నారు.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎక్కువ సంఖ్యలో నామినేషన్ లు దాఖలు కావడంతో ఏకగ్రీవానికి అవకాశం లేకుండా పోయి ఎన్నిక అనివార్యం అవుతుందని అభ్యర్థులు భావిస్తున్నారు.

వన్యప్రాణులను కాపాడటం మనందరి కర్తవ్యం..!

కడపజిల్లా అటవీ శాఖ అధికారి కెఎం. నయీమ్ ఆలి..



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 03: కడపజిల్లా.. గోపవరం మండలం.. బద్వేల్ పట్టణం నందు గల ఫాతిమా ఆంగ్ల మాధ్యమ పాఠశాల నందు శనివారం వన్యప్రాణ సంరక్షణ వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప జిల్లా అటవీ శాఖ అధికారి కె ఎం. నయీమ్ ఆలి, సహ అధికారి సిహెచ్. పెద్దయ్య, మరియు ఇతర అధికారులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథి జిల్లా అటవీ శాఖ అధికారి నయీమ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వన్యప్రాణులను కాపాడటం మనందరి కర్తవ్యం.. చెట్లను నాటాలి పర్యావరాన్ని కాపాడాలి అనే అంశాలపై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వన్య ప్రాణులను హింసించినా, చంపిన అది నేరం అవుతుందని, 5 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించ వలసి వస్తుందని కావున వన్య ప్రాణులను, అడవులను కాపాడ వలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు సిస్టర్ జ్యోతిష్య మాట్లాడుతూ.. ఒకప్పుడు అడవులనేవి క్రూరమృగాలకు, సాదు జంతువులకు నిలయంగా ఉండేది అన్నారు. కాని నేడు అడవులు కనుమరు గవుతున్నాయని, వాటిని కాపాడ వలసిన బాధ్యత మన అందరిపై ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థి, విద్యార్థునులు తో పాటు పిఈటి, ఎన్.సి.సి టీచర్లతో పాటు పాఠశాల బోధన సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చెయ్యాలి

భూసేకరణలో నిర్లక్షం, అలసత్యం వహించే అధికారులుపై చర్యలు తప్పవు - జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి



ఇది కద నిజం,ఏలూరు, అక్టోబరు 03: జిల్లా కలెక్టరేటు గౌతమీసమావేశ మందిరంలో శనివారం చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుకు భూసేకరణ పనులు పురోగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, నూజీవీడు సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న లు పాల్గొన్నారు. ప్రాజెక్టు పనులు పురోగతి, ఇప్పటివరకు భూసేకరణ చేసిన భూములు, ఎన్ని ఎకరాలకు పరిహారం చెల్లించారు, ఇంకా ఎన్ని ఎకరాలకు పరిహారం చెల్లించాలి, ఇంకా ఎన్ని ఎకరాలు భూసేకరణ చెయ్యాలి, తదితర అంశాలుపై జిల్లా కలెక్టరు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చెయ్యాలని, పనులు పురోగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భూసేకరణలో నిర్లక్షం, అలసత్యం వహించే అధికారులుపై చర్యలు తప్పవని అన్నారు. ప్రాజెక్టు పరిధిలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు ప్రకారం నష్టపరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ఎలాంటి జాప్యానికి తావులేకుండా క్షేత్రస్థాయి పరిశీలనలు పూర్తి చెయ్యాలని అన్నారు. భూసేకరణకు సంబంధించి ఏవైనా న్యాయపరమైన లేదా క్షేత్రస్థాయి సమస్యలు ఉంటే రైతులతో మాట్లాడి సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు. రెవెన్యూ, ప్రాజెక్టు అధికారులు, జలవనరులు, సంబంధిత శాఖలు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా భూసేకరణ పూర్తిచేసి పనులకు అప్పగించాలని ఆదేశించారు. ?ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడం ద్వారా రైతులకు సాగునీరు అందించే ప్రభుత్వ లక్ష్యాన్ని సాకారం చెయ్యాలని, మిగిలిన పనులుపై లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పులిచింతల యస్ఇ జి.రామకోటేశ్వరరావు, కొవ్వూరు యస్డిసి ఏ.శ్రీశిల్పి, ఆయా మండలాలు తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, జిల్లా కలెక్టరేటు సూపర్డెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

కోనసీమ తెలుగుదేశం పార్టీ లో కలకలం ... !!



అమలాపురం (ఇది కద నిజం)అక్టోబర్ 3 :కోనసీమ జిల్లా పరిషత్ అభ్యర్థి ఎంపికకు సంబంధించి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో జరిగిన తీర్మానం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోని ఎమ్మెల్యేలతో విస్తృతంగా సంప్రదింపులు జరపకుండానే తీర్మానం చేయడంపై మెజార్టీ ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

జిల్లా పరిషత్ అభ్యర్థి ఎంపిక వంటి కీలక అంశంపై జిల్లాలోని ఎమ్మెల్యేలందరి అభిప్రాయాలను తెలుసుకుని, సమన్వయంతో నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పలువురు ఎమ్మెల్యేలు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

అభ్యర్థి గెలుపు అవకాశాలతో పాటు ఆయన వ్యక్తిత్వం, రాజకీయ నేపథ్యం, ప్రజల్లో ఉన్న ఆదరణ తదితర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని వారు సూచించినట్లు సమాచారం.

అన్ని నియోజకవర్గాల రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ఎమ్మెల్యేలతో చర్చించిన అనంతరం అభ్యర్థిని ఖరారు చేయడం ద్వారా భవిష్యత్తులో అనవసరమైన వివాదాలకు అవకాశం లేకుండా చూడవచ్చని కొంతమంది ఎమ్మెల్యేలు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్యేల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుగానే తీర్మానం చేయడంపై పార్టీ అధిష్టానం కూడా దృష్టి సారించినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో ఇప్పటికే చేసిన తీర్మానంపై తదుపరి చర్యలు, అభ్యర్థి ఎంపిక విషయంలో అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ప్రాధాన్యత సంతరించుకుంది.

అయితే ఈ అంశంపై పార్టీ అధిష్టానం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.అలాగే పొత్తు ధర్మం విస్మరించి అభ్యర్థి ఎంపిక చేయడం పై జనసేన, బి.జే. పి నాయకత్వం కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బి.జె.పి నుంచి ఆశావహులు జాబితా సిద్ధంగా ఉంది జనసేన నుంచి కూడా వారి అభ్యర్థుల జాబితాను సిద్ధం చేశారు.

ఇక తెలుగుదేశం లో మెట్ల రమణబాబు,చెరుకూరి సాయిరాం పేర్లు అధిష్టానం పరిశీలన ఉండగా జిల్లా తెలుగుదేశంపార్టీ మాత్రం గంధం పల్లంరాజు పేరును సూచిస్తుంది.అలాగే ఎన్నికల నోటిఫికేషన్ రిజర్వేషన్లు సమతుల్యత ఆధారంగా జిల్లా పరిషత్ చైర్మెన్ పదవి బి.సి.ల కు కేటాయించాలనే ప్రపోజల కూడా అధిష్టానం పరిశీలిస్తుంది. అలాగే చంద్రబాబు పవన్ కళ్యాణ్ లు ఎస్.సి సామాజిక వర్గం నుంచి కూడా కోనసీమలో ప్రాధాన్యత గల పదవి కి ఎంపిక చెయ్యాలనే ఆలోచన తో ఉన్నట్లు తెలుస్తుంది. కోనసీమ తెలుగుదేశం పార్టీ తొందరపడి ముందే కూసింది అనే దానిపై అధిష్టానం సీరియస్ అయింది.

నేర దర్యాప్తులో నైపుణ్యాలే కీలకం



విశాఖపట్నం,ఇది కద నిజం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (DSNLU)లో లీగల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో వార్షిక క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ (CSI 7.0) పోటీ 7వ ఎడిషన్‌ను ఘనంగా ప్రారంభించారు. తరగతి గది సిద్ధాంతాలను వాస్తవ నేర దర్యాప్తుతో అనుసంధానం చేస్తూ, న్యాయ విద్యార్థుల్లో నేర దృశ్య నిర్వహణ, ఫోరెన్సిక్ విశ్లేషణ, క్రిమినల్ ప్రాసీజర్‌పై ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించడమే ఈ పోటీ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

విశాఖపట్నం మొదటి అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఎం. వెంకట రమణ ముఖ్య అతిథిగా, విశ్రాంత జిల్లా జడ్జి, CGRF చైర్‌పర్సన్ బి. సత్యనారాయణ గౌరవ అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి చేతుల మీదుగా అనుకరణ నేర దృశ్యాన్ని ఆవిష్కరించారు.

వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. సూర్య ప్రకాశ రావు మాట్లాడుతూ, కోర్టులో నేర నిర్ధారణకు సమగ్ర దర్యాప్తు మూలస్తంభమని అన్నారు. విద్యార్థి దశ నుంచే దర్యాప్తు పద్ధతులు, ఫోరెన్సిక్ అంశాలపై అవగాహన కల్పించడం వల్ల భవిష్యత్తులో క్లిష్టమైన నేర కేసులను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు.

ముఖ్య అతిథి ఎం. వెంకట రమణ మాట్లాడుతూ, సాక్ష్యాలను సక్రమంగా భద్రపరచడం, విధానపరమైన నిబంధనలను పాటించడం దర్యాప్తులో అత్యంత కీలకమన్నారు. న్యాయ విద్యలో ఫోరెన్సిక్ సైన్స్‌ను అనుసంధానం చేయడం ద్వారా సమర్థవంతమైన న్యాయవాదులను తీర్చిదిద్దవచ్చన్నారు.



ఈ పోటీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 20 ప్రముఖ సంస్థల నుంచి 80 జట్లలో 240 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఇన్‌ఛార్జ్ డా. విశ్వచంద్రనాథ్ మదాసు, ప్రొఫెసర్ సి.పి. నందిని, అధ్యాపకులు, విద్యార్థి నిర్వాహకులు పాల్గొన్నారు.

దువ్వూరులో 18 వ రోజుకు చేరిన వీఆర్ఏల నిరవధిక సమ్మె..!

మా సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేసిన వీఆర్ఏలు..



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 03: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట మండల గ్రామ రెవెన్యూ సహాయకులు అయిన వీఆర్ఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 18 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఆర్ఏలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏ సంఘం నాయకులు మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వీఆర్ఏలకు జూనియర్ అసిస్టెంట్, వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే స్కేల్ పే అమలు చేసి సర్వీస్ క్రమ బద్ధీకరించాలని, కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్ఏల సంఘం ప్రతినిధులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వీఆర్ఏల నిరవధిక సమ్మెకు పలు ప్రజా సంఘాల నాయకులు శిబిరాన్ని సందర్శించి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

చింతూరు ఐటీడీఏ పీఓను మర్యాదపూర్వకంగా కలిసిన ఆదివాసి సంక్షేమ పరిషత్:



చింతూరు (ఇది కద నిజం)అక్టోబర్ 3 :పోలవరం జిల్లా చింతూరు ఐ.టీ.డీ.ఏ ప్రాజెక్టు అధికారిని చింతూరు డివిజన్ ఆదివాసి సంక్షేమ పరిషత్ బృందం శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ చింతూరు డివిజన్ కన్వీనర్ కారం రవి మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులకు సంబంధించిన అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా నాన్-ట్రైబల్స్ బినామీల పేర్లతో ఆదివాసుల భూములను ఆక్రమించి, ఐదవ షెడ్యూల్ పరిధిలోని చట్టాలను ఉల్లంఘిస్తూ ఆదివాసి భూముల్లో వేలాది ఎకరాల్లో జామాయిల్ తోటలు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలను అరికట్టి ఆదివాసుల భూములను పరిరక్షించాలని కోరారు.

అలాగే పీసా గ్రామసభలను మరింత బలోపేతం చేయాలని, గ్రామసభలకు ఉన్న చట్టబద్ధమైన అధికారాలను సమర్థవంతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని గట్టు కోయ ఆదివాసులకు పెన్షన్లు మంజూరు చేయాలని కూడా పీఓను కోరారు.

ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసుల భూములు, హక్కులు, సంక్షేమానికి సంబంధించిన పోలవరం ల్యాండ్ టు ల్యాండ్ ఆర్ అండ్ ఆర్ మరియు డీ.కే.టి ల్యాండ్స్ కు నష్ట పరిహారం త్వరగా చెల్లించాలని పలు సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ బృందం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వివిధ సమస్యలపై వినతిపత్రాన్ని ఐటీడీఏ పీఓకు అందజేశారు

ఈ కార్యక్రమంలో రవ్వ ప్రసాద్, సరియం రాజ్ కుమార్,మడివి రాజు, దుబి లక్ష్మణ్, కుంజ. శ్రీను తదితరులు పాల్గొన్నారు

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 04-10-2026



‘భోగి’కి బిగ్ టీజర్ ట్రీట్!

శర్వానంద్ హీరోగా, దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న లేటెస్ట్ మూవీ ‘భోగి’. తాజాగా ఈ మూవీ నుంచి అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ‘భోగి ప్రపంచం ఆవిష్కరణకు సిద్ధంగా ఉంది.. అక్టోబర్ 4న భారీ టీజర్ సందడి చేయబోతున్నది.. సిద్ధంగా ఉండండి’ అంటూ టీజర్ రాబోతున్నట్లు ప్రకటించారు. ప్రజెంట్ రిలీజ్ చేసిన ఈ పోస్టర్ టీజర్‌పై ఎక్స్‌పెక్టేషన్స్‌ను పెంచుతోంది. ఇదిలా ఉంటే.. ఈ మూవీ ఆగస్టు 28న విడుదల కావాల్సి ఉండగా.. ‘భోగి కోసం నిరీక్షణ మరికొంత కాలం కొనసాగుతోంది.. వి.ఎఫ్.ఎక్స్ పనులకు అదనపు సమయం పడుతోంది. కొత్త విడుదల తేదీ త్వరలో ప్రకటిస్తారు’ అని చెప్పుకొచ్చారు. కానీ ఇప్పటి వరకు సినిమా విడుదలపై ఎలాంటి అప్డేట్ రాలేదు. దీంతో శర్వ ఫ్యాన్స్‌లో కాస్త నిరుత్సాహం నెలకొంది. ఈ క్రమంలోనే ఇప్పుడు టీజర్ అప్డేట్‌తో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నారు మేకర్స్. మరి ఈ టీజర్ సోషల్ మీడియాలో ఎలాంటి బ్లాస్ట్ ఇస్తుందో వేచి చూడాల్సి ఉంది.



‘ఓం’కు కొత్త డేట్ ఫిక్స్!

కోలీవుడ్ వర్సటైల్ యాక్టర్ ధనుష్, మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కాంబోలో రాబోతున్న భారీ పాన్-ఇండియా యాక్షన్ చిత్రం ‘ఓం’. దసరా పండుగ సీజన్‌ను టార్గెట్ చేస్తూ అక్టోబర్ 16న బాక్సాఫీస్ బరిలోకి దిగాల్సిన ఈ విజువల్ వండర్‌ను వాయిదా వేస్తున్నట్లు గతంలో హీరో ధనుష్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో చిత్ర యూనిట్ విడుదల చేసిన సరికొత్త అధికారిక పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాను ఊపేస్తోంది. తాజా అప్డేట్ ప్రకారం ‘ఓం’ నవంబర్ 20వ తేదీన థియేటర్లలోకి తీసుకురానున్నారు. రెండు భాగాలుగా అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ఫస్ట్ పార్ట్‌ను తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నారు.

ఈ చిత్రానికి ‘అమరన్’ చిత్రంతో జాతీయ ఉత్తమ దర్శకుడి అవార్డు సొంతం చేసుకున్న రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తుండటం ప్రధాన ఆకర్షణగా మారింది. ధనుష్, మమ్ముట్టిల యాక్షన్ సీక్వెన్స్‌లు తెరపై తీవ్ర ఉత్కంఠను రేకెత్తించనున్నాయి. వీరితో పాటు నేచురల్ బ్యూటీ సాయిపల్లవి, టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తుండగా.. బాలీవుడ్ దిగ్గజ నటుడు నసీరుద్దీన్ షా, మలయాళ నటుడు ఇంద్రన్స్ అత్యంత కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ వాయిదాతో నేచురల్ బ్యూటీ సాయిపల్లవికి అరుదైన అవకాశం దక్కింది. దీపావళి కానుకగా ఆమె నటించిన భారీ చిత్రం ‘రామాయణ’ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ మరుసటి నెలే అంటే నవంబర్ 20న ‘ఓం’ కూడా థియేటర్లలోకి అడుగుపెట్టనుండటంతో.. బ్యాక్ టు బ్యాక్ రెండు భారీ పాన్-ఇండియా రిలీజ్‌లతో బాక్సాఫీస్‌పై సాయిపల్లవి హవా కొనసాగడం ఖాయంగా కనిపిస్తోందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. వండర్‌బార్ ఫిల్మ్స్, ఆర్ టేక్ స్టూడియోస్ బ్యానర్లపై ధనుష్, శ్రద్ధా అగర్వాల్, అజ్మత్ జగ్మగ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సెన్సేషనల్ కంపోజర్ సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, ఆర్.కలైవానన్ ఎడిటర్‌గా, కె.ఎళిల్ అరసు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. నవంబర్ 20న బాక్సాఫీస్ వద్ద ‘ఓం’ ఎలాంటి విధ్వంసం సృష్టిస్తుందో వేచి చూడాలి.



బాక్సాఫీస్‌పై ‘కల్ట్’ కన్ను!

టాలీవుడ్ మాస్ కా దాస్ విశ్వక్ సేన్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవాటెడ్ గ్లోబల్ స్లాషర్ ఫిలిమ్ ‘కల్ట్’. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో మొట్టమొదటి సారిగా వస్తున్న ఈ భారీ బడ్జెట్ స్లాషర్ సినిమాకు సంబంధించి మేకర్స్ అప్‌డేట్ అందించారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన అన్ని కార్యక్రమాలు పూర్తి కాగా, అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా అత్యంత వైభవంగా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఇటీవల విడుదలైన ‘కల్ట్’ టీజర్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. ఇటు ట్రేడ్ వర్గాల్లో, అటు ప్రేక్షకుల్లో ఈ చిత్రంపై భారీ బజ్ ఏర్పడింది. కేజీఎఫ్ లాంటి పాన్ ఇండియా చిత్రాలకు అద్భుతమైన మ్యూజిక్ అందించిన సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ రవి బసూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఆయన అందించే పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లనున్నాయని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తుంది.

ఈ సినిమా షూటింగ్ తాజాగా విజయవంతంగా పూర్తయింది. రామోజీ ఫిల్మ్‌సిటీలో ఎంతో ప్రతిష్టాత్మకంగా వేసిన భారీ సెట్‌లో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. దాదాపు 40 నుండి 50 రోజుల పాటు వందలాది మంది మోడల్స్, నటీనటులతో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన కీలక సన్నివేశాలు భారతీయ చలనచిత్ర చరిత్రలోనే నెక్ట్ లెవెల్‌లో ఉండబోతున్నాయని సమాచారం.

జెన్-జీ యూత్‌లో ప్రత్యేకమైన కల్ట్ ఫాలోయింగ్ ఉన్న సెన్సేషనల్ డైరెక్టర్, నటుడు తరుణ్ భాస్కర్ ఈ చిత్రానికి మాటలు అందిస్తుండటం విశేషం. ఇది సినిమాకే హైలైట్‌గా నిలవనుంది. ‘యానిమల్’ లాంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు సౌండ్ డిజైన్ అందించిన సచిన్ ఈ సినిమాకు కూడా పనిచేస్తుండటంతో సౌండ్ పరంగానూ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి దక్కనుంది. తారక్ సినిమాస్ పతాకంపై సందీప్ కాకరాల ఏమాత్రం ఖర్చుకు వెనకాడకుండా అత్యంత భారీ బడ్జెట్, అత్యాధునిక టెక్నాలజీతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కేవలం భారతీయ భాషలలోనే కాకుండా, విదేశీ భాషలలోనూ ఏకకాలంలో విడుదలయ్యేలా ఈ గ్లోబల్ ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్నారు.

ఈ చిత్రంలో విశ్వక్ సేన్‌తో పాటు గాయత్రి భరద్వాజ్, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, ‘పుష్ప’ ఫేమ్ తారక్ పొన్నప్ప, ప్రజ్ఞ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అక్టోబర్ 30న థియేటర్లలో సందడి చేయనున్న ఈ ‘కల్ట్’ సినిమా ప్రేక్షకులకు మునుపెన్నడూ చూడని సరికొత్త అనుభూతిని అందించడం ఖాయమని చిత్ర వర్గాలు వెల్లడిస్తున్నాయి.

తుపాకుల నుంచి వెండితెరపైకి!

హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసిన తొమ్మిది మంది మహిళా మావోయిస్టులు త్వరలోనే వెండితెరపై మెరిసేందుకు సిద్ధమవుతున్నారు. మావోయిస్టు హింస నేపథ్యంలో తెరకెక్కనున్న ఒక ప్రముఖ బాలీవుడ్ చిత్రంలో నటించే అరుదైన అవకాశం వీరికి లభించింది. వివరాల్లోకి వెళితే.. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ వేదికగా జాతీయ చేనేత దినోత్సవాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో లొంగిపోయిన మహిళా మావోయిస్టులు పాల్గొని ర్యాంప్ వాక్ చేశారు. ఆ తర్వాత వారి ర్యాంప్ వాక్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యి, బాలీవుడ్ చిత్ర నిర్మాతల దృష్టి వీరిపై పడింది.

నటనలో ప్రత్యేక శిక్షణ..

జాతీయ మీడియ కథనం ప్రకారం.. మావోయిస్టుల జీవితాల ఆధారంగా ఓ సినిమా తెరకెక్కించేందుకు ఓ బాలీవుడ్ నిర్మాత సన్నాహాలు చేస్తున్నారు. ఆ చిత్రంలో కొన్ని పాత్రల కోసం ఈ మాజీ మహిళా మావోయిస్టులను పరిశీలిస్తున్నారు. వారి నిజ జీవిత అనుభవాలు పాత్రలకు మరింత సహజత్వాన్ని తెస్తాయని మేకర్స్ అభిప్రాయపడుతున్నారు. ఆడిషన్లు నిర్వహించి అందులో ఎంపికైన వారికి నటనలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. 1994లో బస్తర్ ప్రాంతంలో చోటుచేసుకున్న ఒక యథార్థ సున్నితమైన సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు సమాచారం. ఒకప్పుడు స్వయంగా మావోయిజం ప్రభావాన్ని, ఆ భావజాలాన్ని దగ్గరగా చూసి ఆ తర్వాత సాధారణ జీవితంలోకి అడుగుపెట్టిన ఈ మహిళలను సినిమాలో భాగం చేయడం ద్వారా కథకు మరింత సహజత్వం, జీవకళ వస్తుందని దర్శకనిర్మాతలు భావిస్తున్నారు. తుపాకులు చేతపట్టిన చేతులతో ఇప్పుడు వెండితెరపై తమ అనుభవాలను ప్రతిబింబించేందుకు ఈ మహిళలు సిద్ధమవుతుండటం గమనార్హం.



బస్తర్‌లో షూటింగ్..

ఈ సినిమా చిత్రీకరణలో మెజారిటీ భాగాన్ని రాబోయే నవంబర్, డిసెంబర్ నెలల్లో బస్తర్‌లోని దట్టమైన అటవీ ప్రాంతాల్లోనే పూర్తి చేసేలా ప్లాన్ చేశారు. జనజీవన స్రవంతిలోకి వచ్చిన మాజీ మావోయిస్టులకు పునరావాసంతో పాటు ఇలాంటి వినూత్న అవకాశాలు దక్కడం వారి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపుతోందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే చిత్రబృందం అధికారికంగా వెల్లడించనుంది.



‘మహాకాళ్’తో భన్సాలీకి సంబంధం లేదు

టాలీవుడ్ సంచలన దర్శకుడు చందూ మొండేటి తన ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ‘మహాకాళ్’ సినిమాకు, ప్రముఖ బాలీవుడ్ దర్శక-నిర్మాత సంజయ్ లీలా భన్సాలీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇటీవల సోషల్ మీడియాలో వీరిద్దరి కలయికపై వస్తున్న రకరకాల ఊహాగానాలకు ఆయన తెరదించారు. అయితే, ఇదే సమయంలో బాలీవుడ్ స్టార్ మేకర్ సంజయ్ లీలా భన్సాలీతో తాను కలిసి పనిచేయబోతున్నట్లు ఒక ఆసక్తికర విషయాన్ని వెల్లడించి అందరిని షాక్‌కి గురిచేశాడు.



తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చందూ మొండేటి మాట్లాడుతూ.. సంజయ్ లీలా భన్సాలీ తనను ప్రత్యేకంగా సంప్రదించారని, ఆయనతో తాను ఒక విభిన్నమైన ప్రాజెక్ట్ కోసం చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. భన్సాలీ స్వయంగా తనకు రెండు వేర్వేరు అద్భుతమైన కథలు వినిపించారని, తన నిర్మాణ సంస్థలో అందులో ఒక సినిమాను డైరెక్ట్ చేయాలని కోరారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని చందూ మొండేటి స్పష్టం చేశారు. తాను ప్రస్తుతం ఎంతో కసిగా తెరకెక్కిస్తున్న ‘మహాకాళ్’ సినిమా షూటింగ్ పూర్తిగా పూర్తయిన తర్వాతే, బాలీవుడ్ ప్రాజెక్ట్‌కు సంబంధించి తదుపరి అడుగులు వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఒక వైపు పాన్-ఇండియా రేంజ్‌లో ‘మహాకాళ్’ చిత్రంతో పాటు మరోవైపు ప్రముఖ బాలీవుడ్ దిగ్గజ నిర్మాణ సంస్థతో సినిమా చర్చలు జరుగుతుండటంతో టాలీవుడ్ వర్గాల్లో ఈ వార్త హాట్ టాపిక్‌గా మారింది.